


సిల్వర్ పతక విజేతకు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తర ప్రదేశ్ గజియాబాద్‌లో గతనెల 27 నుంచి ఈనెల 2వరకు జరిగిన ఖేల్ ఇండియా సీనియర్ నేషనల్ ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన ఆర్.గాయత్రి సిల్వర్ మెడల్, టి. సత్య జ్యోతి కాంస్య పతకం సాధించారు. క్రీడా కారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కలిశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విజయనగరం ముఖ్య శిక్షకులు పి.అప్పలనాయుడు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం.శ్రీనివాస్ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

హెల్త్ అలవెన్స్ రికవరీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని..

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

వేతనాల్లో హెల్త్ అలవెన్స్‌కు రికవరి చేయాలని ఆదేశాలు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ వేతనాల్లో రికవరీకి జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్మికులను సచివాలయాలకు బదలాయించే చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పారిశుధ్యేతర కాంట్రాక్టు కార్మికులు, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాటర్ సెక్షన్‌లో ఇంకా అనేక విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం చైర్మన్, మున్సిపల్ మేనేజర్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు గండ్రేటి గౌరీసు, కార్యదర్శి జె.రామారావు, కోశాధికారి ఎం.ప్రసాదు, బంగారి, యుగంధర్, వెంకటి, జి.వాసు కార్మికులు పాల్గొన్నారు.



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



విజయనగరం.. కమిషనర్‌కు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు

విజయనగరం టౌన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ కొనసాగించాలని, రికవరీ ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని, రెండు నెలల బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్పొరేషన్ కమిషనర్‌కు శనివారం సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.రమణ, ఎ. జగన్మోహన్ వినతి పత్రం అందజేశారు. సిఎఫ్ఎంఎస్ అధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర ఖజానా అధికారులు పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న హెల్త్ అలవెన్సులను 2022 జనవరి నుంచి ఇప్పటివరకు రికవరీ చేయాలని ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కోవిడ్ వారియర్స్ పారిశుధ్య కార్మికుల సేవలను కీర్తిస్తూ వారికి చెల్లించే హెల్త్ అలవెన్సును రద్దు చేయాలని ఆలోచించడం పట్ల ప్రభుత్వానికి సమంజసం కాదని అన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థలో రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయి హెల్త్ అలవెన్సు చెల్లించి, రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించుకునే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే సామూహికంగా విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని అన్నారు. వినతి అందించిన వారిలో బి.తిరుమల రావు, జి.రామా, జి.కుమారి, బి.రమణ, డి.రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు, గిరిజన వర్సిటీలకు

త్వరలో శంకుస్థాపన

మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర హైకోర్టు శుక్రవారం వెలువరించిన తీర్పుతో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి న్యాయపరమైన అన్ని అడ్డంకులు తొలగిన నేపథ్యంలో త్వరలో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. భూసేకరణ సంబంధించిన తదుపరి ప్రక్రియలను పూర్తిచేయడంపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి విశాఖ పర్యటనకు ఈనెల 11న వస్తున్న సందర్భంగా ఎయిర్‌పోర్టు శంకుస్థాపన వుండదని పేర్కొన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లతో సమీక్షించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గిరిజన వర్సిటీ భూసేకరణలో భాగంగా రైతుల నుంచి పూర్తి స్థాయిలో అంగీకార పత్రాలు తీసుకోవలసి వుందన్నారు.

పై ఓవర్ భూములకు పరిహారంపై కలెక్టర్ నిర్ణయిస్తారు

విజయనగరం పట్టణానికి సమీపంలో ద్వారపూడి వద్ద రైల్వే ట్రాక్ పై నిర్మిస్తున్న వంతెనకోసం తీసుకున్న భూములకు చెల్లించాల్సిన పరిహారాన్ని జిల్లా కలెక్టర్ నిర్ణయిస్తారని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. పై ఓవర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన యజమానులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలసి మంత్రి బొత్స సత్యనారాయణను కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. తమకు న్యాయబద్ధంగా పరిహారం ఇప్పించాలని, తాము వాణిజ్య అవసరాలకు వినియోగించే భూమిని ఇచ్చినందున మార్కెట్ ధరం ఇవ్వాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తన పరిధిలో వున్న మేరకు గరిష్టంగా ధరను నిర్ణయించి చెల్లిస్తారని చెప్పారు.

ఎమ్మెల్యే నిధుల నుంచి బొబ్బిలి రోడ్డు విస్తరణకు నిధులు

శాసనసభ్యుల నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి బొబ్బిలి పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్థంభాల తొలగింపునకు అవసరమయ్యే నిధులను మంజూరు చేయాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. బొబ్బిలిలో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్థంభాల తొలగింపునకు నిధుల మంజూరుపై మంత్రి రోడ్లు భవనాలు, మున్సిపల్, ఇపిడిసిఎల్ అధికారులతో సమీక్షించారు. విద్యుత్ స్థంభాల మార్పిడి చేపట్టేందుకు మరో రూ.20 లక్షలు అవసరం వుంటుందని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు మంత్రికి వివరించారు. బొబ్బిలి ఎమ్మెల్యే నిధుల నుంచి ఈ మొత్తం మంజూరు చేయాలని మంత్రి సూచించారు. స్థానిక ఎమ్మెల్యే శంబంగి చినప్పల నాయుడు, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు మంత్రి అభినందన

జాతీయ స్థాయిలో స్వచ్ఛ విద్యా పురస్కారానికి జమ్ము మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడం పట్ల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు. జమ్ము పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఎం.రామ్మోహన్‌తో కలసి, సమగ్రశిక్ష పిఒ వి.స్వామినాయుడు, ఎఎంసి ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, ఎంఇఒ. రాజు తదితరులు జిల్లాకు వచ్చిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యానారాయణను శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జమ్ము పాఠశాలకు అవార్డు వచ్చిన విషయాన్ని తెలుపగా వారిని మంత్రి అభినందించారు. ఈ అవార్డు స్ఫూర్తితో జిల్లాలో మరిన్ని పాఠశాలలు స్వచ్ఛ పాఠశాలలుగా రూపొందించాలని ఆదేశించారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

- రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని పర్యటనలో వివరించండి
- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి -విశాఖపట్నం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ రాసింది. అందులోని వివరాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శనివారం మీడియాకు వివరించారు. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదు.. సరికదా ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారన్నారు. అలా అమ్మడం సాధ్యం కాని పక్షంలో పరిశ్రమను మూసేస్తామేగానీ నడపబోమని కేంద్ర మంత్రులు పార్లమెంటు సాక్షిగానే ప్రకటన చేసిన విషయాన్ని అజశర్మ గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్మినా, మూసివేసినా రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీరని హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకొని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో అది రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అజశర్మ ఉటంకించారు. విశాఖలో జరిగే ప్రధాని సభలో ఆయనతోపాటు తమరూ ఉన్నందున విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రధానిని అడగాలని సిఎంను కోరారు. అదే సందర్భంలో రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, విశాఖ, విజయవాడ మెట్రో రైలు వంటివి సాధ్యం కాదని కేంద్రం చేతులు దులిపేసుకుందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులను నిలిపివేసిందన్నారు. ఉత్తరాంధ్రలో నిర్మించవలసిన పెట్రో యూనివర్సిటీ ఇంకా నిర్మాణమే ప్రారంభం కాలేదని, గిరిజన యూనివర్సిటీకి స్థల సేకరణ కూడా జరగలేదని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామని ప్రకటన చేశారుగానీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదన్నారు. శతాబ్దంపైగా చరిత్ర కలిగిన విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఉత్తరాంధ్రకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు ఉండాలని ప్రధానిని కోరాలన్నారు. రాష్ట్ర విభజన చట్టాన్ని, దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేలా చూడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం ఈ నెల 9 నుంచి 12 వరకు వివిధ రూపాలలో నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించారని, ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడితే అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వత్తాసు పలకడమే అవుతుందన్నారు.





అధికారులను ప్రశ్నిస్తున్న రైతు ఏడువాక అప్పలనాయుడు, ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళా రైతు అప్పలకొండ

ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదు

తెగేసి చెప్పిన వేపాడ, వల్లంపూడి రైతులు

ప్రజాశక్తి-వేపాడ

పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని రైతులు తెగేసిచెప్పారు. మండల కేంద్రమైన వేపాడ, వల్లంపూడి రైతులతో భూసేకరణ గ్రామసభను శనివారం నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్ దొర, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు డిఇ సుప్రజ గ్రామసభకు హాజరయ్యారు. ఎస్‌డిసి సుదర్శనదొర మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ కాకుండా రైతులతో చర్చించి, వారి అభిప్రాయం మేరకే భూసేకరణ చేస్తామని తెలిపారు. దీనికి రైతులు సహకరించాలని కోరారు. దీనికి రైతులు అభ్యంతరం వ్యక్తంచేశారు. రైతులకు కన్నీరు మిగిల్చే ఈ కాలువకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని స్పష్టంచేశారు. డిజైన్ మార్చి పల్లపు భూములు నష్టపోకుండా మెరక భూముల మీదుగా కాలువ వెళ్తే అభ్యంతరం లేదన్నారు. కానీ ప్రస్తుతం రాళ్లు పాతిన ప్రాంతంలో కాలువ పనులకు అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. రూ.50 లక్షలు విలువ చేసే ఎకరాకు రూ.12 లక్షలు ఇస్తామంటే రైతులు ఆత్మహత్య చేసుకోవాలే తప్ప రైతుగా జీవించే పరిస్థితి లేదన్నారు, రైతుకు నష్టం లేకుండా రైవాడ, విజయరామసాగర్, చిలకలగడ్డ మీదుగా నీరు తరలిస్తే ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని, రైతులను రక్షించిన వారవుతారని భూ నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ అధికారులకు సూచించారు. రైతులకు నష్టం చేసే కాలువకు మాత్రం భూములు ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. కాలువ నిర్మాణంతో ఐదు ఎకరాల వరకు నష్టపోతున్నట్లు డబ్బిరాజుపేటకు చెందిన రైతు ఏడువాక అప్పలనాయుడు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. కాలువకు భూములు ఇవ్వలేమని, ప్రభుత్వ భూముల మీదుగా కాలువ డిజైన్ మార్చాలని డిమాండ్ చేశారు. రైతులు రౌతు బాబూరావు, మజ్జి శ్రీను, పలువురు మహిళా రైతులు కన్నీళ్లతో అధికారులకు తమ గోడు వెలిబుచ్చారు. డిజైన్ మార్చాలన్న ఏకవాక్య తీర్మానాన్ని గ్రామసభలో ఆమోదించి, ఉన్నతాధికారులకు తెలియజేయాలని డిమాండ్‌చేశారు. ఈ గ్రామసభలో వేపాడ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు, వల్లంపూడి ఎంపిటిసి, తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పుపై పోస్టుకార్డు ఉద్యమం

మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్‌టిఆర్ వైద్య కళాశాల పేరు మార్పుపై పోస్టుకార్డు ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జిల్లా వ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యాన చేపట్టినట్లు కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. ఈ పోస్టుకార్డులను రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు పంపనున్నట్లు వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం పేర్లు మార్పు చేయడం మంచి సంస్కృతి కాదని హితవు పలికారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు గతంలో 2700 ఎకరాలు కేటాయించగా, ఇప్పుడు రైతులకు మేలు జరిగే విధంగా 500 ఎకరాలు తగ్గించినట్లు చెబుతున్నారని, దీనివల్ల కార్గో, రన్‌వేకు స్థలం సరిపుతుందా అని ప్రశ్నించారు. ఇవి లేకపోతే ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలోనే విభజన బిల్లులో ఉన్న 11సంస్థలకు సంబంధించిన స్థలాలు, అంశాలు పరిశీలించారని, ఇప్పుడు కొత్తగా చేసేదేమీ లేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఇకనైనా నాటకాలు మానుకొని ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంలో అందరి భాగస్వామ్యం

విజయనగరం టౌన్ : అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీ రాములనాయుడు, అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి రామచంద్రరావు అన్నారు. శనివారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో సచివాలయ కార్యదర్శులతో అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవినీతిని ఏవిధంగా అరికట్టవచ్చో సోదారణంగా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీరాములునాయుడు మాట్లాడుతూ సామాజిక రుగ్మతగా అవినీతి పెను సవాల్ విసురుతోందని అన్నారు. దీనిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు మాట్లాడుతూ వ్యక్తిగత స్వప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడడమే అవినీతికి ప్రధాన కారణమని అన్నారు. ప్రజలకు అందించే సేవలు పారదర్శకంగా ఉండాలే తప్ప అవినీతి మయంతో ఉండకూడదని చెప్పారు. అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలను పూర్తి పారదర్శకంగా అందించాలన్నారు. సమావేశంలో అవినీతి నిరోదక శాఖ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

కార్పొరేషన్, పోలీసు శాఖల సమన్వయ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వివిధ శాఖల సమన్వయంతో నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా కార్యాచరణ రూపొందించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయ భవనంలో పోలీస్, నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి శాఖ, అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. నగరంలో శాశ్వత పరిష్కారం దిశగా ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలు గూర్చి అధికారులు చర్చించారు.. ప్రధానంగా పార్కింగ్ స్థలాల గుర్తింపు, వీధి విక్రయదారుల క్రమబద్ధీకరణ, గ్రీన్, రెడ్ జోన్లు ఏర్పాటు, ఎమ్‌జి రోడ్డు పార్కింగ్ సమస్యలు, ప్రధాన జంక్షన్ల అభివృద్ధిపై ప్రణాళిక, పందుల నియంత్రణ, నామఫలకాల ఏర్పాటు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ శ్రీ రాములు నాయుడు మాట్లాడుతూ అందరి సహకారంతో నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తున్నామన్నారు. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో నగరంలో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వీధివిక్రయదారులు క్రమబద్ధీకరణ కాకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణకు అవరోధాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఇన్‌ఛార్జి డిఎస్‌పి త్రినాధరావు మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన సహాయ సహకారాలు తమ శాఖ నుండి అందిస్తామని తెలిపారు. ట్రాఫిక్ డిఎస్‌పి మోహన్ రావు మాట్లాడుతూ వీధివిక్రయదారులను క్రమబద్ధీకరించి, పార్కింగ్ స్థలాలు కేటాయిస్తే ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బి డిఇ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎడిఇ సత్యనారాయణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదన్ రావు, అమ్మాజీ రావు, ఇఇ శ్రీనివాసరావు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

రాష్ట్రంలో రౌడీల రాజ్యం : టిడిపి

ప్రజాశక్తి- గరివిడి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై రాళ్ల దాడి చేయటం సిగ్గుచేటని విజయనగరం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలో తన నివాసంలో శనివారం ఉదయం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో శాంతి భద్రతలు నశించాయన్నారు. రౌడీలు రాజ్యం ఏలుతున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రతి ఒక్కరిను ఇబ్బందులు గురిచేస్తున్నారు. సొంత బాబాయ్ హత్య జరిగి నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ నిందితులను పట్టుకోలేని పరిస్థితిలలో జగన్ రెడ్డి పోలీస్ యంత్రాంగం ఉందని నాగార్జున ఏద్దేవా చేశారు. సమావేశంలో వెన్నె సన్యాసి నాయుడు, తిరుమల రాజుకిరణ్‌కుమార్‌రాజు, చనమల మహేశ్వరరావు, దన్నాన రామచంద్రుడు, తాడ్డే సన్యాసి నాయుడు, బలగం వెంకటరావు, ముల్లు రమణ, వెంపడాపు రమణ మూర్తి పాల్గొన్నారు.



విజయనగరంకోట.. నిరసన తెలుపుతున్న తెలుగు యువత సభ్యులు

తెలుగు యువత నిరసన

విజయనగరంకోట : టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడిని ఖండిస్తూ తెలుగు యువత ఆధ్వర్యాన శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొగిరి పైడిరాజు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు గంటా రవి, మైలపల్లి వాసు, కోరాడ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తుత్తి సలహాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మన జిల్లాలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైనది. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు 80శాతం కుటుంబాలవారు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం చూసినా వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో వ్యవసాయ రంగం ఉత్పత్తి, తద్వారా జిల్లాకు వస్తున్న ఆదాయమే అత్యధికం. ఇంతటి కీలకమైన వ్యవసాయ రంగానికి సలహా మండలి అంటే ఎంత పటిష్టంగా ఉండాలి? ఎంతో లోతుగా ఆలోచించడమే కాదు. క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి రైతులకు అన్ని విధాలా మేలు జరిగే విధంగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి. కానీ, మన జిల్లాలో సాగుతున్న సలహా మండలి సమావేశం ప్రభుత్వానికి సలహాలు ఇచ్చినట్టుగాగానీ, రైతుల ఈతిబాధలను పరిగణనలోకి తీసుకున్నట్టుగా గానీ కనిపించడం లేదు. కష్టమైనా, నష్టమైనా పుడమి తల్లిని నమ్ముకుని అందరికీ అన్నంపెట్టే రైతన్నలకు ఉచిత సలహాలు ఇస్తున్నట్టుగా పనిచేస్తోంది. ఔను.. ఇటీవల ఈనెల 1వ తేదీన జరిగిన సమావేశమే ఇందుకు మచ్చుతునక. ఈ ఏడాది పగడ్బందీగా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటన చేసింది. ఏటా కొనుగోలు ప్రక్రియలో తలెత్తుతున్న లోపాలను సూక్ష్మంగా చర్చించలేదు. మన జిల్లాలో ధాన్యం తూకంలోను, ధరలోనూ ఏళ్ల తరబడి దగా జరుగుతోంది. దీన్ని ఎలా అధిగమిస్తారన్నది చర్చించ లేదు. లక్షానికి అనుగుణంగా, పారదర్శకంగా ధాన్యం సేకరిస్తాం అన్నది పాతడైలాగేనని చాలా మంది చర్చించు కుంటున్నారు. వరి తరువాత స్థాయిలో సాగయ్యే చెరకు రైతులకు సలహా మండలి భరోసా ఇవ్వలేదు. జిల్లాలోవున్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరణ పేరుతో మూసివేసి, ఆ తరువాత తెరవలేమంటూ ప్రభుత్వం చేతులెత్తేసిన విషయం విధితమే. గత ఏడాది లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీని నష్టాలపేరిట మూసివేశారు. దీనివల్ల రైతులకు జరుగుతున్న కష్టనష్టాలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సలహా మండలి సభ్యులు పట్టనట్టుగా వ్యవహరించారు. ఈ ఏడాది టన్ను రూ.3050 మద్దతు ధర ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పెరిగిన ధరల నేపథ్యంలో ఈ ధర ఏమాత్రం సరిపోదని రైతులు, రైతు సంఘం నాయకులు గగ్గోలు పెడుతుండగా రాష్ట్ర ప్రభుత్వం టన్ను ధర రూ.2,700 ప్రకటించింది. వేరుశనగ, గోగు, పత్తి, మొక్కజొన్న ధరలు కూడా అత్తెసరుగానే ఉన్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది గోను సాగు కాస్త పెరిగింది. గత ఏడాది పుట్టీ (బేలు) అంటే సుమారు 3క్వింటాళ్లు రూ.15వేలు చొప్పున ధర పలకగా, ఈ ఏడాది ప్రభుత్వం తరపున కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో, దళారులు పరిస్థితులను బట్టి రూ.9వేల నుంచి రూ.10వేలకు మించి కొనడం లేదు. వేరు శనగకు ప్రకటించిన రూ.5,850 ధర ఏమాత్రం సరిపోదని వేరుశెనగ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా నిర్ణయించిన ధరలే సరిపోవడం లేదంటే కొనుగోలుకు మీనమేషాలు లెక్కించడం వల్ల దళారుల బారినుండి తప్పించుకోలేని పరిస్థితి మరోవైపు. గతంతో పోలిస్తే విత్తనాలు మొదలుకుని ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగాయి. సబ్సిడీలు తగ్గాయి. మరోవైపు ఈ ఏడాది వర్షాలు ఎంతో అనుకూలించినప్పటికీ గత నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా 2223 ఎకరాల్లో వ్యవసాయ పంటలు నాశనమైనట్టు సాక్షాత్తు అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే వ్యవసాయరంగంలో లోటుపాట్లు, రైతుల కష్టనష్టాలు అన్నీ, ఇన్నీ కావు. ఇవన్నీ చర్చించి, తీర్మానాల ద్వారా ప్రభుత్వానికి నివేదించాల్సిన సలహా మండలి సభ్యులు, అధికారులు సుడిదోమలు నివారిస్తాం. పడగ్బందీగా కొనుగోలు చేస్తాం అంటూ ఉచిత సలహాలకు పరిమితమౌతున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు చర్చించుకుంటున్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com

క్రీడలతో బంగారు భవిష్యత్తు

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి-బొండపల్లి
చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను శనివారం బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 750 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడంతోపాటు విద్యార్థులు క్రీడలు ఆడేందుకు మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు దోహద పడతాయని చెప్పారు. ఒకటో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

పాఠశాలకు రూ.లక్షన్నర విరాళం

బొండపల్లి హైస్కూల్‌కి వైసిపి రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీరాజు రూ.లక్షన్నర విరాళం ప్రకటించారు. నియోజకవర్గంలో మోడల్‌గా ఎన్‌సిసి బ్యాండు మేళా తీర్చిదిద్దాలని అందుకు అవసరమైన యూనిఫాం, బ్యాండు సామగ్రి కొనుగోలు, శిక్షణకు ఆ మొత్తాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రభూజీని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వి.ముత్యాలునాయుడు, ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వైస్ ఎంపిపి జి.ఈశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి, ఎంఇఒ బూసినాయుడు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలో కోర్టు సముదాయం ప్రారంభం

బొబ్బిలి : పట్టణంలో అద్దె భవనంలో కోర్టు సముదాయాన్ని శనివారం జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ చక్రవర్తి ప్రారంభించారు. పాత కోర్టు భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో మల్లమ్మపేట రోడ్డులో కోర్టు కోసం అద్దె భవనాన్ని తీసుకున్నారు. దీనిని జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ చక్రవర్తి, పార్వతీపురం జిల్లా అదనపు జడ్జి సిహెచ్ రాజగోపాలరావు, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు జిల్లా జడ్జి భాష ప్రారంభించారు. నూతన భవనం ప్రారంభించేంత వరకు అద్దె భవనంలో కోర్టు నిర్వహించేందుకు హైకోర్టు అనుమతులు ఇచ్చినట్లు జిల్లా జడ్జి చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.వాసుదేవన్, జూనియర్ సీనియర్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సోమ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చోడిగంజి రామారావు, కార్యదర్శి డి.అప్పలరాజు, ఉపాధ్యక్షులు జగదీశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నేరాలు అరికట్టేందుకు కృషి

కొత్తవలస : గ్రామాల్లో నేరాలను అరికట్టేందుకు మహిళా పోలీసులు కృషి చేయాలని సిఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, జూదం, కోడి పందేల సమాచారం గోప్యంగా అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజూ సమాచారం ఎప్పటి కప్పుడు అందించాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ బొడ్డు దేవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలెన్నో..

కొత్తవలస : ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలెన్నో ఉన్నాయని ఇంటర్ కమ్యూనిటి రిసోర్స్ పర్సన్ శ్రీలక్ష్మి, సిఆర్‌పి శ్యామల అన్నారు. చీడివలస క్లస్టర్, సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతోదెందేరు హైస్కూల్లో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలకు తీసుకునే ఆహారంలో పోషక పదార్థాలు ఉండాలనే ఉద్దేశంతో సబల సంస్థ స్కూల్లో కిచెన్ గార్డెన్ వేయించి, ప్రకృతి వ్యవసాయంలో రాజీలేని అంశాలను పాటిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, పండించే పంటలు, నేల సంరక్షణ కోసం సత్యారావు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం.సునీత పాల్గొన్నారు.

సాయి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవగాహన

విజయనగరం టౌన్ : సాయి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ హై స్కూల్లో విజిలెన్స్ ఎవర్నెస్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవినీతి సామాజిక పురోగతికి అడ్డంకి అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అవినీతి వలన సమాజం ఎదుగుదలకు ఎటువంటి ఇబ్బందులూ ఉన్నాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సాయి గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ జి.శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం పి. శేఖర్ పాల్గొన్నారు.

రూ.83.68 లక్షలతో అభివృద్ధి పనులు

విజయనగరం టౌన్ : నగరంలోని వివిధ డివిజన్లలో కోటీ 83 లక్షల 68 వేల అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 1, 6,7,9,10, 12 డివిజన్లలో గతంలో గుర్తించిన పనులకు శంకుస్థాపన చేయగా పూర్తయిన పనులను ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వర రావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి

విజయనగరం : అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబర్లో, విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ, వివిధ అవసరాల కోసం, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు మన వద్దకు వచ్చినప్పుడు అన్ని పనులను నిజాయితీగా, పారదర్శకంగా విధులను నిర్వహించి ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విజయనగరం కోట : తమ కుమారుడు డాక్టర్ వైష్ణవ్ (అఖిల్) జ్ఞాపకార్థం ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక వెంకటరామా ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్-90003 20783, 80961 71616లను సంప్రదించాలని తెలిపారు.

గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

విజయనగరం టౌన్ : ఏడాదికాలంగా నిరంతరాయంగా అన్నార్తులకు ఆహారాన్ని అందిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ఆదర్శప్రాయులని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శనివారం నగరంలోని ఎన్‌సిఎస్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుడ్ బ్యాంక్ వద్ద గౌరీ సేవా సంఘం నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా పేదలకు ఆహారాన్ని వడ్డించారు. అనంతరం మీడియాతో కోలగట్ల మాట్లాడుతూ త్వరలో కొత్తపేట జంక్షన్ లో మరో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎఎ రావు, మద్దాల భాస్కరరావు, శేఖర్, నగేష్ పాల్గొన్నారు.

పిజి స్టార్ ఆధ్వర్యాన నేటి నుంచి ఉచిత వైద్య పరీక్షలు

విజయనగరం : నగరంలోని రామానాయుడు రోడ్డులోగల పిజిస్టార్ ఆస్పత్రిలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జనరల్ సర్జరీ విభాగంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఎస్‌వి రమణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలు వరకు హెర్నియా, హైడ్రోసెల్ సమస్యలకు ఉచిత తనిఖీలతో పాటు అవసరమైతే ఉచిత ఆపరేషన్లు కూడా చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

గుండెపోటుతో మాజీ సైనికుడు మృతి

బొబ్బిలి : పట్టణంలోని మల్లంపేటకు చెందిన మాజీ జవాన్ చిరంజీవి (38) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయనకు భార్య స్వప్న, 12 ఏళ్ల కుమారుడు ఉన్నారు. చిరంజీవి మృతికి జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, మాజీ సైనికుల సంఘం గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు సంతాపం తెలిపారు. మాజీ సైనికుల సంఘం నాయకులు.. ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో కుటుంబ వైద్య సేవలు

వేపాడ : మండలంలోని రామస్వామిపేట, పెద్దకృష్ణరాజుపురం గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యసేవలందించారు. డాక్టర్ ఎల్.రమాదేవి, పి.కిరణ్, మోహన్, హెచ్‌ఎ గాలి నాయుడు, ఎఎన్‌ఎం ఎల్.రమ, ఎంఎల్‌హెచ్‌పి జి.సంధ్య, ఆశావర్కర్ ఎస్.పార్వతి పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలందరికి వైద్యం అందుతుందని పతివాడ సర్పంచ్ ఆకుల పైడిరాము అన్నారు. గోవిందపురం పిహెచ్‌సి పరిధిలోని పతివాడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి కిరణ్ గ్రామస్థులను వైద్య తనికీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 104 డాక్టర్ పాపారావు, ఎంపిహెచ్ శ్రీనువాసరావు, డిఇఒ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరావు, ఆరోగ్య సిబ్బంది వరలక్ష్మి, దేవుడమ్మ, త్రినాదమ్మ, ఆశాలు, రమా, బండమ్మ, రమణమ్మ, కనకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు 1092దరఖాస్తులు

నెల్లిమర్ల : పట్ట భద్రుల ఓటు నమోదుకు 1092 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ కె.వి.రమణరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఓటు నమోదుకు 1092 మంది దరఖాస్తు చేసుకోగా 352 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయని, 23 దరఖాస్తులు తిరస్కరించామని, మిగతావి రిటర్నింగ్ అధికారికి పంపించినట్లు చెప్పారు. కాగా ఈ నెల 7వరకు ఓటు నమోదు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

డెంకాడ : పూసపాటిరేగ మండలంలోని రోలిచిప్పాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పీఠానికి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆలయాన్ని సందర్శించి కమిటీ పెద్దలకు రూ. 25వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ మాజీ సర్పంచ్ పసుపులేటి శ్రీనివాస్ రావు, కొయ్య ఎల్లన్న, కొయ్య లక్ష్మణ్ రావు, సాడి లక్ష్మణ్ రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పాడిరైతులకు దుప్పట్లు పంపిణీ

గుర్ల : విశాఖ డైరీ పాడి రైతులకు తెట్టంగి మిల్క్ సొసైటీ వద్ద శనివారం 186 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. తెట్టంగి విశాఖ డైరీ అధ్యక్షులు వెన్నె సన్యాసినాయుడు పాడి రైతులకు సోలాపూర్ దుప్పట్లను అందచేశారు. కార్యక్రమంలో మిల్క్ సెంటర్ కార్యదర్శి, పాడి రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తిరు వీధి మహోత్సవం

గరివిడి : చీపురపల్లి, గరివిడి, గర్భాంలో వీర బ్రహ్మేంద్ర స్వామి తిరు వీధి మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ప్రజలకు ఉండాలన్నారు. వీర బ్రహేంద్ర స్వామి కాల జ్ఞాన సృష్టి కర్త అని అన్నారు. కాల జ్ఞానంలో బ్రహ్మేంద్ర స్వామి చెప్పిన చాలా విషయాలు జరిగాయన్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘం తిరు వీధి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు సేవ లను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి భాస్కర్‌రావు, పట్నాన ఈశ్వరరావు, బి.శంకరరావు, తోలేటి బాబు పాల్గొన్నారు.

కాలువ డిజైన్‌లో మార్పులుండవు

ఎస్‌డిసి పద్మలత


మాట్లాడుతున్న ఎస్‌డిసి పద్మలత

ప్రజాశక్తి - గుర్ల
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ ఎలైన్ మెంట్‌లో ఎటువంటి మార్పులూ ఉండవని భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మలత అన్నారు. శనివారం మండలంలోని పకీరు కిట్టలి రెవెన్యూ పరిధిలో ఎడమ కాలువ భూసేకరణలో భాగంగా జరిగిన గ్రామ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ప్రాజెక్ట్ డిఇఇ హేమలత మాట్లాడుతూ గ్రామం పరిధిలో 61.23 ఎకరాలు భూసకరణ జరుగుతుందన్నారు. రైతులకు ఏ విధమైన అభ్యంతరాలున్నా తెలియ చేయాలన్నారు. భూసేకరణ విషయమై రైతులు మాట్లాడుతూ కాలువ ఎలైన్ మెంట్‌ను మార్చలన్నారు. గాంధి సాగరం రిజర్వాయర్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేసినా బాగుంటుందని రైతులు తమ అభిప్రాయాన్ని తెలిపారు. గ్రామంలో భూసేకరణ చేసే క్రమంలో నాలుగు సాగునీటి చెరువులు కోల్పోతున్నామన్నారు. దీని వల్ల ఆ చెరువులు కింద సాగు చేసే భూమి ఎడారిగా మారుతుందన్నారు. ప్రభుత్వం తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాలువ స్వరూపాన్ని మార్చలన్నారు. గ్రామంలో ప్రస్తుతం ఎకరా రేటు రూ.60 లక్షలు ఉందన్నారు. ప్రభుత్వం అరకొర పరిహారం అందించి రైతులను అన్యాయం చేయవద్దన్నారు. ఈ విషయమై ప్రత్యేక ఉప కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు మెట్ట భూమికి రూ.10 లక్షలు పల్లం భూమికి రూ.13.75 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుల వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ గుండా వచ్చే నీరును కొండగంగ్రేడు వద్ద లిఫ్ట్ చేయగా మిగిలిన నీటిని గడిగెడ్డ మిగులు నీరు వెళ్లే దగ్గర వదిలి పెట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయం అధికారులు చెప్పడంతో రైతులు మరింతగా ఆందోళన చెందుతూ ఆ మిగులు నీటిని గజపతినగరం దగ్గర చంపావతి నదిలోకి వదిలిపెట్టిన ప్రభుత్వానికి ఆర్థిక భారం తప్పడంతో పాటు రైతులకు కూడా నష్టం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరారు. గ్రామ సభ జరిగే ప్రదేశం లో కాలువ ఎలైన్ మెంట్ బేనర్‌ను ప్రభుత్వ ఉద్యోగులు మీటింగ్ పూర్తయ్యే వరకూ పట్టుకొని ఉండడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగోలు సూరి నాయుడు, మాజీ సర్పంచ్ అప్పల నాయుడు, రాము నాయుడు, మాజీ ఎంపిటిసి రామకృష్ణ, గ్రామపెద్దలు బి.శ్రీనివాసరావు, బొత్స అప్పల నాయుడు, తహశీల్దార్ పద్మావతి, ఆర్‌ఐ అప్పల రాజు, విఆర్‌ఒ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిసిడిఒ మాలతి


ప్రజాశక్తి - పూసపాటిరేగ
కెజిబివి విద్యార్థుల్లో పోటీ తత్వం పెరగాలని గ్రేడింగ్ సిస్టమ్ పెడుతున్నామని జిసిడిఒ మాలతి అన్నారు. శనివారం స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను ఆమె పరిశీలించారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెడుతున్న సెమినార్‌ల్లో విద్యార్థులంతా పాల్గొవాలన్నారు. ప్రతి శనివారం సాయంత్రం ఒక గంట సమయం సెమినార్ ఏర్పాటు చేసి ఇద్దరు విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ ఉన్న వారి జీవిత విశేషాలను ఇతర పిల్లలకు వివరించాలన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యతతో పాటు కొత్త విషయాలను నేర్చుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో గ్రేడింగ్ పద్ధతి తీసుకువచ్చామన్నారు. దాంతో ఏ నెలలో ఎవరు బాగా చదివితే వారి గ్రేడ్ మారుతుందన్నారు. తద్వారా విద్యార్థుల్లో ఆరోగ్య కరమైన పోటీతత్వం పెరిగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల భోజనాలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలును వినియోగించుకొని మంచి ఉత్తీర్ణత సాదించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్ ఎ. బారతి పాల్గొన్నారు.

రూ.12వేల కోట్లతో శంకుస్థాపనలు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లిమర్ల, డెంకాడ
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో భాగంగా ఈ నెల 11,12 తేదీల్లో నియోజకవర్గంలో 12వేల కోట్లతో శంకుస్థాపనలు చేస్తారని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నెల్లిమర్ల సమీపంలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో శనివారం ఆయన నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం డెంకాడ మండలంలోని పెద తాడివాడ గ్రామంలో కూడా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు అన్ని రకాలుగా సిద్ధం కావాలన్నారు. నియోజకవర్గం ప్రజాప్రతినిధులు ఉత్తరాంధ్ర పట్టభద్రుల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ని పరిచయం చేశారు. ఇటీవలే భోగాపురం ఎయిర్ పోర్టుకు కోర్టు అనుమతులు కూడా లభించాయన్నారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తప్పు దోవ పట్టించేందుకు తమ హయాంలోనే శంకుస్థాపన చేశారని అనటం హాస్యాస్పదమని కోర్టులో కేసులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకే అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా శంకుస్థాపన చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్, మాజీ ఎమ్‌పి డివిజి శంకర్‌రావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన


పంట నమోదును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గజపతినగరం
మండలంలోని తుమ్మకాపల్లి గ్రామంలో పంట నమోదును జాతీయ బీమా బృందం పరిశీలించింది. ఎస్‌బిఐ సాధారణ బీమా ప్రాంతీయ అధికారి రూపక్ బిశాంత్, రాష్ట్ర అధికారి అమిత్ శర్మ ఆ గ్రామంలో ఆర్‌బికె పరిధిలోని రైతులను పంట నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఇన్స్యూరెన్స్ మీద ఎవరికైనా ఎటువంటి సందేహాలు ఉంటే తెలపాలని కోరారు. కియోస్క్ ద్వారా రైతుకు అందే సేవలను పరిశీలించారు. ప్రస్తుత పంట ఏ దశలో ఉంది, ఇంకా కోత దశ రావడానికి ఎంత సమయం పడుతుంది అనే దానిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పిఎఫ్‌ఎంబివై పంటల బీమా కింద వరి పంటలో జరుగు పంట కోత ప్రయోగాలు జిల్లా నిర్వాహకులు రాకేష్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్, ఎఒ సిహెచ్.ధనలక్ష్మి, విఎఎ ఎన్.ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాల్సిందే

ప్రజాశక్తి- రేగిడి
పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మండల విద్యాశాఖాధికారి ఎం. వరప్రసాదరావు సూచించారు. ఈ మేరకు శనివారం ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంచాలన్నారు. సృజనాత్మకత విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న గోరుముద్దను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాడు -నేడు పనులు పరిశీలించి, అన్ని హంగులతో తీర్చిదిద్ది గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు దన్నాన రామారావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొంపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి-వేపాడ
మండలంలోని కొంపల్లి గ్రామంలో శనివారం ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సర్పంచ్ నౌడు అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎపిఒ సన్యాసిరావు, కార్యదర్శి ఆర్.కమల, తదితరులు పాల్గొన్నారు.

చినసత్యనారాయణకు సన్మానం

పూసపాటిరేగ : మండలంలోని పూసపాటిరేగ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనపకుర్తి చిన సత్యనారాయణను శనివారం హెచ్‌ఎం బలివాడ శంకరావుతో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు. ఆయన గీసిన స్వాతంత్ర సమరయోధుడు కూనిశెట్టి వెంకట నారాయణదొర చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారుడు బిఎ రెడ్డి సారథ్యంలో స్వాతంత్ర్య స్ఫూర్తి తెలుగు దీప్తి అనే పుస్తకంలో ముద్రించారు. ఆ పుస్తకాన్ని ఈ నెల 4న విజయవాడలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ ఉపాధ్యాయుడు చిన సత్యన్నారాయణను ఎపి గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ళ నారాయణరావు, అంతర్జాతీయ చిత్రకారుడు బిఎరెడ్డి, విజయవాడ ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ నిమ్మరాజు చలపతిరావు సన్మానించారు. దాంతో ఆయన్ను పాఠశాలలో సన్మానించారు.

సంఘాలు బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి- గరివిడి
స్వయం సహాయక సంఘాలు బలోపేతమే లక్ష్యంగా వెలుగు సిబ్బంది పనిచేయాలని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సావిత్రి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. సంఘాలకు సమావేశాలు ఏర్పాటు చేసి, సంఘం, వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు తేల్చాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ జి సీతారామయ్య, ఏపియం ఎల్. పద్మ, ఎల్‌సిసి పి. దుర్గాప్రసాద్, స్త్రీనిధి ఎజిఎం ఎ. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా మహిళల అడుగులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల
పేద మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కుట్టు యంత్రంలో (టైలరింగ్) ఉచిత శిక్షణ ఇచ్చామని వీసీ జిఎస్ఎన్ రాజు అన్నారు. ఇక్కడ రెండు బ్యాచ్‌లలో శిక్షణ పొందిన వారికి శనివారం ఆయన చేతులు మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారి కాళ్లపై వారు నిలబడి ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. బొండపల్లి, నెల్లిమర్ల మండలాల్లో ఇప్పటి వరకు ఒంపల్లి, ఎల్.ఎస్.పురం, చంద్రంపేట, కొరాడపేట, కొండవెలగాడ తదితర గ్రామాల్లో మహిళలకు శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థులకూ ఇక్కడ కుట్టు యంత్రంలో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్.వర్మ, డీన్ కృష్ణమూర్తి, డాక్టర్ సతీష్, డాక్టర్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు

ప్రజాశక్తి - జామి
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందజేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడపగడపకు కార్యక్రమంలో అనేక మంది పథకాలు అందలేదన్న విషయాలు తెలియజేసిన నేపథ్యంలో ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో సుమారుగా రూ.900 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, సక్రమంగా పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో వచ్చిన వినతులపై వివరణలు ఇచ్చారు. సమావేశంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి సభ్యులు జి.సరయు, వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, ఎంపిడిఒ తహశీల్దార్ సతీష్, హేమంత్ కుమార్, డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవు, రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామాల్లో వచ్చిన సమస్యలపై అధికారులతో శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఇంకా గ్రామస్థాయిలో ప్రజలకు చేరువవుతూ వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపిడిఒ కె.కిశోర్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైసిపి నాయకులు బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి జాగీరుగా సచివాలయం

టిఫిన్ చేసేందుకు రీసర్వే సిబ్బందిని బయటకు పంపేసిన వైనం


కార్యాలయం బయట విధులు నిర్వర్తిస్తున్న సర్వే సిబ్బంది

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్
సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి పనిచేయాలి. కానీ అక్కడ సచివాలయాన్ని కార్యదర్శి వెంకటనాయుడు జాగీరుగా వాడుకుంటున్నారు. దిబ్బగుడివలసలో రీసర్వే చేసేందుకు రైతులకు 90 నోటీసులు ఇచ్చేందుకు శనివారం సర్వే, రెవెన్యూ సిబ్బంది సచివాలయానికి వెళ్లారు. సర్వే సిబ్బందిని చూసిన పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు.. 'నాకు చెప్పకుండా ఏ పనీ చేయడానికి లేదు. నేను టిఫిన్ చేయాలి. ఐదు నిమిషాల్లో సచివాలయాన్ని ఖాళీ చేయండి' అని సర్వే సిబ్బందిపై హుకుం జారీ చేశారు. దీంతో చేసేది ఏమీ లేక సర్వే సిబ్బంది బయటకు వెళ్లి రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో కూర్చుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యదర్శి పెత్తనం ఏమిటని గ్రామస్తులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. సొంత జాగీరుగా సచివాలయాన్ని వాడుకుంటున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కమ్యూనికేషన్ లోపం

సచివాలయానికి వెళ్లిన సర్వే సిబ్బందిని పంచాయతీ కార్యదర్శి పక్క గదికి వెళ్లాలని చెపితే, బయటకు వెళ్లండని అన్నట్లు తప్పుగా అర్థం చేసుకున్నారని తహశీల్దార్ రాజారావు వివరణ ఇచ్చారు. ఇరువురితో మాట్లాడి సమస్య పరిష్కరించామని చెప్పారు.

కేబుల్ టీవీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల
కేబుల్ టీవీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుల అరసాడ నారాయణ రావు డిమాండ్ చేశారు. శనివారం కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేబుల్ ఆపరేటర్లు మొయిద జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రభుత్వ పింఛన్ దార్ల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుల నారాయణ రావు మాట్లాడుతూ కేబుల్ టివిని ప్రభుత్వం పరిశ్రమగా గుర్తించి ఆపరేటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2017లో ప్రతి పక్షనేతగా జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో పోల్ టాక్స్ రద్దు చేసి గుర్తింపు కార్డులు ఇస్తానని కేబుల్ ఆపరేటర్లుకు హామీ ఇచ్చారని వెంటనే అమలు చేయాలని కోరారు. ఏపిఎఫ్‌సిఎల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతం రెడ్డి కేబుల్ ఆపరేటర్లకు అండగా నిలిచి ఎల్‌టి బాక్సుల ఇస్తామని, కేబుల్ టీవీ అభివృద్ధి చేస్తామని చెప్పినట్లు తెలిపారు. డిటిహెచ్, ఇంటర్ నెట్‌ల నుంచి కేబుల్ ఆపరేటర్లను ఆదుకొని, నిలుపుదల చేసిన బాక్సుల అద్దెలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు శాంతి ఈశ్వర రావు, విజయనగరం పట్టణ ప్రెసిడెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కామేశ్వరి

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ
వల్లంపూడిలో మూడు అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యాభ్యాసం, ఆటపాటలతో విద్య నేర్పడం, సులభతరంగా చిన్నారులకు విద్యపై అవగాహన కల్పించడం వంటివి అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, లత, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

9న సీజ్ చేసిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి-బొబ్బిలి
నాటుసారా, అక్రమ మద్యం కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లకు వేలం వేయనున్నట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొవాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి
స్థానిక పాత రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. రైల్వే హెచ్‌సి ఈశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పాత రైల్వే గేటు వద్ద శనివారం ఉదయం విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వచ్చే రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయసు 50ఏళ్లు ఉంటుంది. లాల్చి, పంచి ధరించి ఉన్నాడు. మతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మతుని వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.